# ఏం చెప్పడం...ఎలా చెప్పడం?

రచన:
డి. అమరేశ్వరరాయశర్మ

ఉన్నట్లుండి అలా అడిగేటప్పటికి యేం చెప్పాలో అర్థంకాక ఉక్కిరి బిక్కిరయ్యాడు. అసలా ప్రశ్న మిత్రుడు తనను అడుగుతాడని ఊహించనే లేదు ఆనంద్ ఉరఫ్ ఆనందరావు. ఇదే ప్రశ్న రెండేళ్ళ క్రితం అడిగినట్లయితే యెంత ఉబలాటపడుతూ యెంత ఉత్సాహంగా చెప్పేవాడో - కాని ఇప్పుడు అంతా తారుమారయింది. 'ఏం బ్రదర్ అలా ఆయిపొయ్యావ్ సారీ' మిత్రుణ్ణి యెలాగో పంపించి బస చేరుకున్నాడు. మాస్టర్ డిగ్రీ పుచ్చుకోటానికి యింకా నాల్గు నెలలే వున్న ఆనందరావు.

ఆనందరావు స్వగ్రామం ఓ పల్లెటూరు. పల్లెటూరయినంతమాత్రాన ఆ గ్రామానికి పేరు ప్రతిష్ఠలు లేవనుకోటం పొరపాటు. ఆ జిల్లాలో ఆహారధాన్యాలు పండించటంలో గాని, అమ్మకంలో గాని ఆ గ్రామానికో విశిష్ఠ స్థానముంది, అలాంటి ఓ పల్లెటూరు నివాసి ఆనందరావు. ఆనందరావు తండ్రి సనాతనాచార పరాయణుడు. కులము, మతము అంటే మొనలేని మక్కువ. పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడేవాడు కాకపోయినా, ఉన్న మంచిపేరుకు వన్నె తగ్గకుండా చూసుకొనే వ్యక్తి.

రఘురామయ్యగారి పేరు ఆ ఊరి ధనవంతుల జాబితాలో ఉంది. ఆయనకు ఒక్కగానొక్క కూతురు - విమల. రఘురామయ్యగారికి కులమతాలమీద, సనాతన సంప్రదాయాలమీద అట్టే నమ్మకం లేదు. ఏకైక పుత్రిక విమలను అల్లారుముద్దుగా, అతి గారాబంగా పెంచాడు. ఆమె వాంఛలకు గాని, స్వాతంత్ర్యానికి గాని - ఆయనకు తెలిసినంత వరకు - అడ్డు పెట్టలేదు.

విమల ఆనందరావుతో ఆడుకోటానికి వచ్చేది చిన్నప్పుడు. అతని దగ్గరే చదువుకునేది. తెలియనిది అడిగి చెప్పించుకునేది. విమల చిలిపిపనులు చేసినా, అతనికి వ్యతిరేకమయిన పనేమీ చేసేదీకాదు చిన్నారి విమల. అలా వారి స్నేహం వారి హృదయపరిపక్వదశ ననుసరించి అనురాగంగా, ప్రేమగా మారిపోయింది.

ఆనందరావు వయస్సు పదునెనిమిది. విమల హృదయానికి తోడుగా యెన్నో వింత మార్పులు వచ్చాయి. అప్పుడప్పుడు విమలను తల్చుకుని ముగ్ధుడయేవాడు. ఒకనాడు ఆ ఊళ్లో యెలక్షను మీటింగు జరుగుతోంది. ఆడ, మగ విభేదంలేక జనం ఇసుక వేస్తే రాలనంతగా వచ్చారు. ఆ కాబోతాననుకునే-నాయకుని - ఉపమానములతో కూడిన ఉపన్యాస పటిమ వింటానికి. జనం యెంతమంది ఉన్నా, ఉపన్యాస వేత్త యెంత యిదిగా మాట్లాడినా, విమల - ఆనంద్ ల చూపులను విడదీయలేకపోయినయ్. 'మీటింగ్' అయిన తర్వాత యెక్కడి వా రక్కడ సద్దు మణుగుతున్నారు. విమల తన స్నేహితురాలతో 'ఛీఛీ మొగాళ్ళ కసలు సిగ్గులేదు. వచ్చింది

మీటింగు వినటానికా లేపోతే...'

'అవునవును...బొత్తిగా సిగ్గులేదు.' తన మిత్రునితో అన్నాడు అనంద్ ఉరఫ్ ఆనంద రావు. ఇలా ఛలోక్తులతో, వ్యంగ్య సంభాషణలతో వారి ప్రేమ హృదయంలో సుస్థిరస్థాన మేర్పరచుకుంది.

అ రోజు - తన కాలేజీ చదువుకై పట్నం వెళ్ళాల్సిన రోజు. ప్రయాణ సన్నాహంలో ఉన్న ఆనంద్‌కు కన్నీరు జాలువారే కన్నులతో - విమల - యెదుట సాక్షాత్కరించింది.

'ఎందుకు విమలా ఆ కన్నీళ్లు...అక్కడ నన్నెవరూ యెత్తుకపోరులే.' అని ఊరడించాడు. వెళ్ళేటప్పుడు రెండు లడ్డు తెచ్చి యిచ్చింది ఆనంద్‌కు. బయలుదేరాడు-పట్నానికి - ఆనందరావు.

* * *

కాలచక్రం మామూలుగానే తన కర్తవ్యాన్ని పాటిస్తూ ఓ సంవత్సరం తిరిగింది. ఆనంద్ విమలనే తన హృదయేశ్వరిగా, ప్రేమైకమూర్తినిగా చేసుకోదలచాడు. కాని సనాతన సాంప్రదాయాలపై అభిమానం, నమ్మకం ఉన్న తన తండ్రిగారి నెలా ఒప్పించటం?

డిగ్రీ చదువుకై వెళ్ళిన అనంద్ కోరోజు ఓ ఉత్తరం వచ్చింది. విప్పిచూశాడు. విమల దగ్గరనుండే - ఆ ఉత్తరంతో బాటుగా ఓశుభలేఖ. చేతులు తడబడ్డాయ్. తన కాళ్ళక్రింద భూమి గిర్రున తిరిగినట్లనిపించింది. తనకీ వివాహము తప్పని సరైనదని, ఆనంద్ తప్పక రావాలని ఆ జాబు యొక్క సారాంశం. పోనీలే - ఆమైనా సుఖిస్తే అదే చాలు. ఈ మధ్య కాలంలో విమలను గురించి తన మిత్ర బృందానికి యెన్నో చెప్పాడు. తన విమల ఓ దేవతాస్త్రీ యని, ప్రేమైకమూర్తి యని యెన్నో చెప్పాడు. కాని తనకు నిరాశ యెదురైంది. వివాహానికి శుభాకాంక్షలందజేశాడు, పరీక్షలు దగ్గరయి - పోవటానికి వీలుపడక -

వేసవి శెలవల్లో స్వగ్రామానికి బయలు దేరాడు మిస్టర్ ఆనంద్ ఉరఫ్ ఆనంద్‌రావ్. అతనిప్పుడు ప్రేమను త్యాగం చేసిన మహాత్ముడిలా వున్నాడు. విమల యెలా వుందో - ఛాఛా ఏమిటీ ఊహలు. విమల ఇప్పుడు తనిదికాదు. ఆమెను కన్నెత్తి చూడటానికి కూడ అర్హత లేదిప్పుడు.

* * *

నిర్లిప్తంగా రోడ్డుమీద పోతున్న అతనికి 'ఆనంద్' అని యెవరో పిలిచినట్లయి వెనుదిరిగాడు. ఆమే - ఎవరినైతే తన ప్రేమైకమూర్తియని, ఆరాధ్య దేవత భావించి ఆరాధించేవాడో ఆ విమలే. పరస్త్రీగా, భారత స్త్రీగా ఆమెకు సంఘంలో స్థానం ఉంది. పర పురుషుల్తో మాట్లాడినా, పరాచికాలాడినా అదోరకమైన చూపుల్తో చూస్తారు లోకులు. అందుకనే ముందుకు సాగిపోయాడు, అమె క్షేమన్నే సదా కోరే ఆనంద్.

అందుకనే ఆమెను గురించి ఇప్పుడు తనను యెవరైనా అడిగితే బాధపడతాడు. అదే మిత్రుడడిగిన ప్రశ్న కూడా ఏరా బ్రదర్! ఆనంద్! నీ ప్రేమైకమూర్తియని ఆరాధదేవతని చెబుతూంటావే, ఆమె యెలా వుందిరా!' ఇంతే అడిగింది మిత్రుడు.

గతస్మృతులు జ్ఞప్తికి రాగా గతాన్ని నెమరువేస్తున్న ఆనందరావు 'పోస్ట్‌సార్'అనే మాటతో ఉలిక్కిపడి, తన వివాహవిషయాలను గురించి వ్రాసిన తండ్రిగారి జాబు అందుకొని ఆసక్తితో విప్పాడు.